# మార్గదర్శి

గంటి భానుమతి




తనెక్కడికి వెళ్తే అక్కడికే వస్తూ, తనెక్కడుంటే అక్కడే తచ్చాడుతూ, వెనక వెనకే తిరుగుతున్న కూతురు ప్రత్యూషను ఆశ్చర్యంగా గమనిస్తూనే తన పని తను చేసుకుంటోంది సమీర.

"ఏవిటో, అంతలా నా వెనకాలే కూడా కూడా తిరుగుతున్నావు. ఏదైనా చెప్పాలా, ఏదైనా కావాలా?" ఇంక ఉండబట్టలేక కూతుర్ని అడిగేసింది.

అవునన్నట్టుగా తలూపింది.

"అవునమ్మా! నిన్ను అడగాల్సింది ఉంది. దానికి నీ సమాధానం కావాలి. నువ్వు ఖాళీగా కనపడ్తే చెప్పాలనుకుంటున్నాను. కానీ నువ్వేమో బిజీగా ఉన్నావు కదా..ఎలా..!"

"ఈ పీక్ టైంలో నాకు ఖాళీ ఎక్కడుంటుంది? ఏమాత్రం ఒక్క నిమిషం లేటైనా, ఆ తర్వాతవన్నీ కూడా ఆలస్యం అయిపోతాయి. అందుకని నేను నీకు ఖాళీగా కనపడను. నువ్వు చెప్పాలనుకున్నది, చెప్పదలచుకుంటే చెప్పు. నా పని చేసుకుంటూనే వింటాను" కొబ్బరిముక్కలు మిక్సీలో వేసి జర్రుమంటూ తిప్పింది సమీర.

"అలా కాదమ్మా నువ్వు అటూ ఇటూ తిరుగుతూంటే నాకు చెప్పడానికి అస్సలు ఇంట్రెస్ట్ రాదు. నువ్వు కూచుంటే నేను చెప్తా" అంటూ మిక్సీని ఆపి, తల్లి రెండు భుజాలమీద రెండు చేతులువేసి, అక్కడే ఉన్న స్టూలుమీద కూచోపెట్టింది ప్రత్యూష.

తనకన్నా పొడుగ్గా, కత్తిరించిన జుట్టుతో బొమ్మలా ఉన్న కూతుర్ని చూసి చిరునవ్వు నవ్వుతూ వంటగట్టుకి వీపునానించింది.

"ఉ...చెప్పేదేదో తొందరగా చెప్తే నా పని నేను చేసుకుంటాను. నాకు కాలేజీ టైము కూడా అవుతోంది"

ఒక్కక్షణం తల్లి మొహంలోకి నిశ్శబ్దంగా చూసింది.

"మనకి చుట్టాలెవరైనా ఉన్నారా?" సూటిగా అడిగింది.

"ఇది అడగడానికా ఇంత బిల్డప్ యిచ్చావ్..ఈ ప్రశ్న నేను కూచుంటేనే అడక్కర్లేదు. నేను పనిచేస్తూంటే కూడా అడగచ్చు. నా టైం వేస్ట్ చేసావ్" అంటూ లేచింది సమీర.

"ఆ..ఆ..లేవకు. నా అడగడం యింకా పూర్తికాలేదు. ముందిది చెప్పు. మనకి చుట్టాలున్నారా..లేరా! ఉంటే మనింటికి ఎవరూ రారేం? మనం కూడా ఎవరిళ్ళకీ ఎందుకు వెళ్ళం? మా ఫ్రెండ్స్ అంతా సమ్మర్‌లో, దసరాల్లో వచ్చే సెలవలకి, పెళ్ళిళ్ళకి, ఫంక్షన్లకి వెళ్తూంటారు. నేనెప్పుడూ ఎవరింటికీ వెళ్ళలేదు. ఈసారి మనం ఎవరింటికయినా వెళ్దాం..సరేనా..సరే..అను..ఉ.." అని మూతిని సున్నాలా చుట్టి గారాలుపోయింది ప్రత్యూష.

సమాధానం చెప్పకుండా సమీర లేచింది.

"లేచావా! సరేలే..కానీ నాకు జవాబు కావాలమ్మా!" సమీర ఆగి, కూతురి కళ్ళల్లోకి దీక్షగా చూసింది.

చేపపిల్లల్లా, మిలమిల మెరుస్తున్న ఆ సన్నటి కళ్ళల్లో ఎన్నో ప్రశ్నలు. వదలడానికి సిద్ధంగా ఉన్న బాణాల్లాంటి ప్రశ్నలు.

ఇప్పుడు ఆమె ఓ చెట్టులా ఉంది. ఓ సందేహాల చెట్టు, ఆకుల్లాంటి ప్రశ్నలు. ఓ ఆకు కోస్తే మరో ఆకు, మరోటి కోస్తే యింకో నాలుగాకులు చిగురిస్తూనే ఉంటాయి.

ఒక్కొక్కసారి ఒక్కొక్క జవాబు కొన్ని వందల ప్రశ్నలకి చిగుళ్ళు వేయవచ్చు.

ఈ క్షణాన ప్రత్యూషకి జవాబు కావాలి. తను జవాబు ఇవ్వాలి. అయితే అది జవాబవుతుందా? ఆత్మకథ అవుతుందా? ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? చెప్తే అర్థం చేసుకుంటుందా? అసలు ఎక్కడనుంచి మొదలుపెట్టి ఎక్కడ ఆపాలి? ఎలా ముగింపు ఎలా చేయాలి?

ప్రస్తుత పరిస్థితిని రెండు నిమిషాల్లో సరిచేయాలి.

"నేనూ, మీ నాన్న ప్రేమించుకున్నాం. రెండు వైపుల పెద్దవాళ్ళకి యిష్టం లేదు కానీ, ఎదిరించి పెళ్ళి చేసుకున్నాం. అందుకే చుట్టాల్లేరు. నీకు ఎంత అర్థం అయిందో నాకు తెలీదు. నాకు పొద్దుపోతోంది. ఇంకేం అడగకు. ఈ టాపిక్ ఇక్కడితో ఆపెయ్యి" అనేసి తన పనిలో మునిగిపోయింది.

ఎంత తేలిగ్గా మూడు ముక్కల్లో చెప్పింది. కానీ చెప్పినంత తేలిగ్గా జీవితం సాగలేదు. పెళ్ళయిన ఆర్నెల్లకే కూతురు పుట్టిందని చెప్పలేకపోయింది. ఇంకా ఎన్నో చెప్పలేకపోయింది.

ప్రత్యూష తల్లిని వదల్లేదు. తల్లి వెనకాలే నుంచుంది.

"ఎదిరించి చేసుకున్నారా? మరి మీ పెద్దవాళ్ళు పోలీసులకి చెప్తామని, రిపోర్టిస్తామని బెదిరించలేదా?" తన సినిమా పరిజ్ఞానం ఉపయోగించి అడిగింది.

మొహంలో రంగులు మారకుండా జాగ్రత్తపడింది సమీర. "ఇచ్చారు. బెదిరించారు. పోలీసులు మమ్మల్ని పట్టుకున్నారు. మమ్మల్ని బలవంతంగా లాక్కెళ్ళడానికి ప్రయత్నించారు. రాయబారాలు చేసారు. ఛంపేస్తామన్నారు. కానీ పోలీసుల సాయంతోనే పెళ్ళిచేసుకుని ఈ ఊరు వచ్చేసాం"

ఆ తర్వాత తల్లి మాట్లాడిందో, ఆపేసిందో ప్రత్యూషకి ఏం తెలీలేదు. మనసు మొద్దుబారిపోయింది. ఇంకేం అనకుండా మాటలు మర్చిపోయినట్టుగా, నిశ్శబ్దంగా అక్కడ నుంచి వెళ్ళిపోయింది. ఆలోచనలతో పగలంతా గడిపేసింది.

ఇన్ని రోజులూ అమ్మా, నాన్నలాంటివాళ్ళూ ఈ ప్రపంచంలోనే లేరనుకుంది. వాళ్ళు చాలా గొప్పవాళ్ళు, తప్పులే చెయ్యరనుకుంది.

ఇంట్లో ఎప్పుడూ వాతావరణం ఆహ్లాదంగా ఉండేది. వాళ్ళిద్దరూ ఎప్పుడూ వాదించుకోలేదు. పోట్లాడుకోలేదు. తనని కానీ, తమ్ముడిని కానీ, ఎప్పుడూ తిట్టలేదు. కొట్టలేదు. ఎంతో గొప్పగా కనిపించే అమ్మ నాన్నలు ఇలా చేసారా? ఎంత పెద్ద తప్పు అది. ఇంట్లోంచి వెళ్ళిపోవాలంటే ఎంత ధైర్యం ఉండాలి! పారిపోవడం, పోలీసులు పట్టుకోవడం, నలుగురూ తిట్టడం, పోట్లాటలు..అచ్చు సినిమాల్లోల్లాగా..అది తప్పనిపించలేదా! ఎవరూ హర్షించని తప్పు. సమాజం ఆమోదించని తప్పు చేస్తున్నామని అనిపించలేదా?

ఇప్పుడు తను అలాంటి తప్పు చేయగలదా? అది అలా చేయడం, ఇంట్లో పెద్దవాళ్ళని బాధపెట్టడం అని తెలుసు. అందుకే అలాంటి ఊహ రానేరాదు. ఆలోచనలు అలా ఆ దార్లోంచి వెళ్ళనే వెళ్ళదు.

ఎప్పుడూ మార్కులు, చదువు, పోటీలు, పాటలు, ఏం చేస్తే బావుంటుంది, ఎలా చదివితే, ఫస్టురాంక్ కాపాడుకోవచ్చు...ఇలా ఉంటాయి. ఇలాంటి ఆలోచనలే ఉండేవి. కానీ ఎప్పుడూ మగపిల్లల్తో స్నేహాలు, వాళ్ళతో గంటల తరబడి కబుర్లు, ప్రేమలాంటివి రాలేదు. మరి అమ్మకెందుకు ఆ ఆలోచనలు వచ్చాయి?

తన స్కూల్లో కొంతమంది ఆడపిల్లలు చదుకోకుండా మగపిల్లల్తో మాట్లాడుతూంటారు. సినిమాల గురించి, హీరో హీరోయిన్ల గురించి మాట్లాడుతూంటే విన్న టీచర్లు వాళ్ళని బాగా తిట్టేవారు. వాళ్ళకి మార్కులు కూడా చాలా తక్కువే వస్తూండేది. అలాంటి ఆడపిల్లల్తో మాట్లాడ్డానికి తామెవ్వరూ యిష్టపడేవారు

కాదు. తను కూడా అలాంటి పిల్లలకి దూరంగానే ఉండేది.

తను ఎలాంటి వాళ్ళతో మాట్లాడదో, ఎలాంటి వాళ్ళకి దూరంగా ఉంటుందో..సరిగ్గా అలాంటి వాళ్ళేనా అమ్మా, నాన్నా!

ఇన్ని రోజులుగా వాళ్ళు దేదీప్యమానంగా వెలిగిపోతున్న రూపాలు. దేవతా విగ్రహాల్లాంటి కళలుట్టిపడే రూపాలు. కానీ ఈ క్షణాన కిలుంపట్టి వెల వెల పోతున్నారు.

రాత్రి నిద్రపట్టలేదు.

దుప్పటిని మెడవరకూ కప్పుకుని, పైన తిరుగుతున్న ఫాన్‌ని చూస్తోంది.

రోజూలాగే ఆ రోజు కూడా ప్రత్యూష, ప్రణవ్ పడుకున్న గదిలోకి వచ్చింది సమీర. పడుకునే ముందు వచ్చి పిల్లల్ని ఓసారి చూసి వెళ్తుంది.

చెరో మంచం మీద పడుకున్న పిల్లల దుప్పట్లు సరిచేసింది.


తల్లి రావడం చూసిన ప్రత్యూష బలవంతంగా కళ్ళు మూసుకుంది.

సమీర కూతురు మంచం దగ్గరికొచ్చి నుంచుంది.

ఓ వైపు ఒత్తిగిలి, అరచేతిని చెంప కిందకి చేర్చి మధ్యమధ్య ఓ కన్ను తెరిచి తల్లిని గమనిస్తోంది. దుప్పటి సగం మొహాన్ని కప్పుతూండడంవల్ల సమీరకి, కూతురి మొహం అస్పష్టంగా కనిపిస్తోంది.

ఇన్నాళ్ళూ దాచివుంచిన గతం, కూతురికి తెలియనిది, రహస్యంగా తనలోనే ఉన్నది, ఈ రోజున కూతురికి అంతా పూర్తిగా కాకపోయినా తెలిసిపోయింది.

నిజానికి తన గతం ఎప్పుడైనా తెలవాల్సిందే. ఇన్నాళ్ళూ చిన్నవాళ్ళు, అడగలేదు. ఇప్పుడు కూతురడిగింది. అంటే పెద్దదయింది. ఈరోజున అబద్ధం చెప్పినా నిజం ఏదో ఓ రోజున తెలుస్తుంది. అందుకే నిజాన్ని క్లుప్తంగా చెప్పింది.



గబుక్కున దుప్పటిని కళ్ళమీద నుంచి మెడవరకూ లాగి కళ్ళు తెరిచింది ప్రత్యూష.

"అమ్మా! ఒకటడగనా?" అంటూ పడుకునే కొంచెం వెనక్కి జరిగి, తల్లి కూచోడానికి ముందు స్థలం చేసింది.

'ఇంకానా..' అన్నట్లుగా చూసింది సమీర.

నీలం రంగు బెడ్ లైటు కాంతిలో, దంతంతో చేసినట్లుగా ఉన్న ఆ తెల్లని మొహాన్ని చూసింది సమీర.

నిన్నటి వరకూ కనిపించిన బాల్యం ఛాయలు ఈరోజున కనపడటం లేదు. పదహారేళ్ళ వయసు తెచ్చిన నున్నదనం అందం, ఆమె నుదుటిమీద, చెంపలమీదపడి మెరుస్తోంది.

"నువ్వు తప్పుచేసావని, నీకెప్పుడైనా అనిపించిందా?" ఆరిందాలా కాకుండా, ఓ సమవయస్కురాలిలాగా అడుగుతున్న కూతుర్ని చూస్తే కూతురిలా అనిపించలేదు. సాటి ఆడదానిలా అనిపించింది. మానసికంగా తన వయసుకి వచ్చేసిందా?

తల అడ్డంగా ఊపింది సమీర.

"లేదు. అలా అనిపించలేదు. అప్పట్లో నా పరిస్థితులు అలాంటివి. ఆ సమయంలో మెరుగైన జీవితం కావాలనుకున్నాను. అది దొరికింది. అలాంటప్పుడు చేసింది తప్పని అనుకునే అవకాశం రాదు. ఆ తర్వాత కూడా రాలేదు"

ఆశ్చర్యంగా తల్లిని చూస్తూ లేచి, గోడకి చేరబడింది.

"అంటే...అమ్మా నువ్వన్ని కష్టాలు పడ్డావా? ఇంట్లోంచి వెళ్ళిపోవాలనుకునే కష్టాలుండేవా? అవి డబ్బుకా! ఆకలికా! సవిత్తల్లా! బాధ్యతల్ని పట్టించుకోని తండ్రా! టీచర్లు బాగా తిట్టికొట్టేవారా? చదువంటే యిష్టం లేకనా? ఎలాంటివి? ఇంట్లోంచి పారిపోయేంత ఏ కష్టం వచ్చింది?"

మంచం మీద కూచుని, ప్రత్యూషలాగా గోడకి చేర

బడింది.

"నువ్వు అన్ని కష్టాలు చెప్పావు. కానీ అవేవీ కానే కావు. నా కష్టానికి నేనిచ్చే డెఫినిషన్ వేరు.. మానాన్న గారు ఓ గవర్నమెంటు ఆఫీసులో పనిచేసేవారు. పొద్దున్న వెళ్తే రాత్రి వచ్చేవారు. ఆఫీసు యింటికి చాలా దూరం. అలిసిపోయి వచ్చేవారు. అందుకని ఎప్పుడూ చిరాకు, కోపం. నాపైన ఇద్దరన్నయ్యలు. ఇద్దరూ హాస్టల్లో ఉండి చదువుకునేవారు. ఇంక ఇంట్లో నేనొక్క దాన్నే. అమ్మానాన్నలు ఇద్దరూ ఎప్పుడూ నేనేం చేయాలో, ఏం చేయకూడదో చెప్తూ రోజులు గడిపేస్తుం టారు. నాది చేదు బాల్యం. ఆ చేదుని భరించలేకపో యాను. మీ నాన్నతో పరిచయం నాకు ఓ బలంగా మారింది"

ప్రత్యూష తల్లి మాటలకి కన్విన్స్ కాలేకపోయింది.

"అమ్మకి నన్నో పెద్ద టాలెంటెడ్ అమ్మాయని అందరూ అనుకోవాలని ఆరాటం, ఆశ, తాపత్రయం. వారానికి రెండు రోజులు డాన్సు క్లాసులు, రెండు రోజులు సంగీతం, రెండు రోజులు యింకెక్క డికో...ఇంక స్కూల్లోకాంపిటీషన్లుంటే అన్నింట్లో నాకు బహుమతి రావాలి. రాకపోతే తిట్లు, దెబ్బలు.

ఈ బిజీ షెడ్యూల్‌లో రాంక్ వెనక్కి వెళ్ళినా, మార్కులు తక్కువొచ్చినా ఊరుకునేది కాదు. నేనేం చద వాలో, ఎంతసేపు చదవాలో, ఎలా చదవాలో అన్నీ ఓ టైంటేబుల్‌గా చేసి ఉంచేది.

పదో క్లాసయిపోయాక నేనేం గ్రూపు తీసుకోవాలో, నాకేది యిష్టమో కనుక్కోకుండా అమ్మానాన్న ఓ నాలుగు రోజులు యుద్ధం చేసారు.

"సమీర డాక్టరు కావాలి. నేను దగ్గరుండి చదివి స్తాను. మన కుటుంబంలో లేడీ డాక్టరే లేదు. సమీర మొదటి లేడి డాక్టరవ్వాలి"

"ఏం మాట్లాడుతున్నావ్! సమీర ఎంత నాజూకు పిల్లో తెలిసీ మెడిసిన్ చదవమంటావా! ఎంత కష్టప దాలో తెలుసా! ఆరేళ్ళు చదవాలి. ఆ తర్వాత హౌస్‌స ర్జన్సీ, ఆ తర్వాత ఓ రెండేళ్ళు పల్లెటూళ్ళో తప్పనిసరిగా పనిచెయ్యాలి. ఆ తర్వాత మూడేళ్ళు పీజీ...మెడిసిన్ పేరు చెప్పి దాన్ని ఉతికేసి పిండేస్తావా..నేనొప్పుకోను..అది ఎంపీసీ తీసుకుని ఇంజనీరవ్వాలి"

'ఆ రెండూ నేను తీసుకోను. ఆర్ట్స్ తీసుకుంటాను' అని నేనంటే ఏదో జరగరానిది జరిగినట్లు చూసి, ఇద్దరూ నన్ను బాగా తిట్టారు. బలవంతంగా ఓ రెసిడెన్షి యల్ జూనియర్ కాలేజీలో ఇంటరులో చేర్పించారు.

అక్కడ ఎప్పుడూ చదువు, చదువు. వారం వారం నా రిపోర్టు ఇంటికి వెళ్ళిపోయేది. మార్కులు చూసి, అమ్మ నాన్న యిద్దరూ వచ్చి తిట్టి వెళ్ళిపోయేవారు. ఒక్కోసారి పిల్లలముందే తిట్టేసేవారు. అది భరించలేక, ఫాన్‌కి చున్నీకట్టి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాను. సరిగ్గా అదే సమయంలో రూంలోకి ఏదో పనుండి వచ్చిన వాళ్ళు, లోపల గడియ ఉండడంతో ఏదో అనర్థం జరుగుతోందని గ్రహించారు. గబగబా తలుపులు బల వంతంగా తీసి, నన్ను క్రిందకి లాగి, డాక్టరుకి కబురుచే సారు. అమ్మ, నాన్న వచ్చారు. అందరూ వాళ్ళిద్దర్నీ తిట్టారు.

నన్ను ఇంటికి తీసుకొచ్చారు. అక్కడ కాలేజి మానే సాను. కామర్సుతో మరో కాలేజీలో యింటికి దగ్గర్లోనే చేరాను. అమ్మ నాన్న నాతో మాట్లాడ్డం మానేసారు. ఒంటరిదాన్నయిపోయాను. కొంచెం చదువుమీద శ్రద్ధ చూపిస్తున్నాను.

సరిగ్గా ఆ సమయంలోనే మీ నాన్నతో పరిచయం. మీ నాన్న చాలా బీదవాడు. నా చేతిలో డబ్బుండేది. అది తనకిచ్చి సాయపడేదాన్ని. ఆ విధంగా ఇంటరు రెండు సంవత్సరాలు అయిపోయాయి.

బి.కాం. కూడా యిద్దరం ఒకే కాలేజీలో చేరాం. మా యిద్దరి సంగతి అమ్మ నాన్నకి తెలిసింది. నన్ను కొట్టి తిట్టి కాలేజీ మానిపించేసారు. ఏం చేయాలో తెలీని స్థితి. నాకు మీ నాన్న ఒక్కడే ఆప్తుడుగా కనిపించాడు.

రోజూ మా యింటి కాంపౌండు దగ్గరకొచ్చి ఓ చీటి విసిరేసేవాడు. నేనూ అలాగే చేసాను. అలా చాలా రోజులు గడిచాయి.

ఈ జైలు జీవితంకన్నా మీ నాన్నతో వెళ్ళిపోవడం మేలనుకున్నాను. అది ప్రేమ అని అనుకోలేదు. అది దేనికి దారి తీస్తుందో, పర్యవసానం ఎలా ఉంటుందో నాకు అక్కర్లేదు. ఆ యింట్లోంచి వెళ్ళిపోవాలి. దానికి మీ నాన్న సాయం తీసుకున్నాను.

అంతే ఓ రోజున వెళ్ళిపోయాను. తర్వాత పోలీసు రిపోర్టు. మమ్మల్ని ఓ వారం రోజుల తర్వాత పట్టుకు న్నారు. మేం మా యిళ్ళకి వెళ్ళలేదు. ఓ స్నేహితుడి యింట్లో ఉన్నాం. కులాలు వేరు. ఆర్థికస్థితులు వేరు.


ఆ తర్వాత పోలీసుల సాయంతో మేం పెళ్ళి చేసు కున్నాం. ఈ ఊరు వచ్చేసాం.

మొదట్లో చదువుకోలేదన్న బాధ ఉండేది. అందుకని మేమిద్దరం పగలు చిన్న ఉద్యోగం చేస్తూనే రాత్రిళ్ళు చదువుకున్నాం. నువ్వు, తమ్ముడు ప్రణవ్, మీ యిద్దర్నీ నాతో తీసుకెళ్ళేదాన్ని.

ఆ రోజుల్లో చాలా కష్టపడ్డాం. డబ్బుకి యిబ్బంది పడ్డాం. అయినా నాకే రోజునా కూడా యింట్లోంచి వచ్చేసానన్న బాధ కలగలేదు. తప్పు చేసాననిపించలేదు. అలాగే చదువులు కొనసాగించాం. ఉద్యోగాల్లో మెట్లు ఎక్కాం. పీజీ పీహెచ్‌డీ చేసాం. నేను కాలేజీ లైనుకి మారాను. మీ నాన్నమాత్రం అదే ఆఫీసులో ఉన్నారు. ఇదీ విషయం..ఇంక పడుకో" అంటూ మంచం దిగబో యింది.

"ఒక్క మాట చెప్పమ్మా"

సమీర ఏం మాట్లాడలేదు.



## విలన్‌గా ఆమీర్?

***'ధూమ్-1'లో విలన్‌గా జాన్ అబ్రహాం నటిస్తే, 'ధూమ్-2'లో విలన్‌గా హృతిక్ రోషన్ విలన్. అంటే రెండు సినిమాల్లోనూ హీరోలు విలన్‌లుగా నటించారు. ఇక 'ధూమ్-3'లో కూడా ఓ హీరోయే విలన్‌గా నటిస్తాడనే ఊహాగానాలు సాగుతున్నాయిప్పుడు. అందుకు ఊతమిచ్చేట్టుగా ఆమీర్‌ఖాన్‌ని ఈసారి విలన్ పాత్రకి తీసుకుంటు న్నారనే వార్త జోరుగా వినిపిస్తోంది. 'ఫనా' సిని మాలో కాస్త నెగటివ్ షేడ్స్ వున్న పాత్రని పోషిం చిన ఆమీర్ ఖాన్ మరి 'ధూమ్-3'లో విలన్‌గా నటిస్తాడో లేదో!***

"నేను, ఎవరితోనైనా వెళ్ళిపోతే నీకేమనిపిస్తుంది?"

కూతురి మొహంలోకి ఆశ్చర్యంగా చూసింది.

"ఏమనుకుంటాను, నాదే తప్పనుకుంటాను. నా పెంపకంలోనే లోపం ఉందనుకుంటాను. ఓ పదిహే డేళ్ళ పిల్ల యిల్లువదిలి వెళ్ళిపోయే పరిస్థితి కల్పించానని అనుకుంటాను"

"నా తప్పు నువ్వు చూడవా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రత్యూష.

"ఊహూ..నీ తప్పు నేను చూడను. తెలిసీ తెలియని వయసు. జీవితం అంటే ఏవిటో తెలీని వయసు. నిన్ను సరిగ్గా సరైన మార్గంలో నడిపించలేకపోయానని, తప్పుని నా మీద వేసుకుంటాను.

ఇంట్లో చిన్నవాళ్ళకీ, పెద్దవాళ్ళకీ మధ్య బంధం పువ్వూ, తావీలా ఉండాలి. ఆ పరిమళం ఆ పూవుచుట్టూ ఉండాలి. అంతేకానీ, పువ్వూ ముల్లులా ఉండకూడదు. ముల్లు గుచ్చుకుంటోందని దూరం జరిగిపోయేలా ఉండకూడదు. ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళనుంచి దూరంగా వెళ్ళిపోవాలనుకుంటే, అది పెద్దవాళ్ళ తప్పే అవుతుంది"

"అంటే నీ విషయంలో..నీకలాగే అనిపించిందా!"

"ఇంతకుముందే చెప్పాను. ఇల్లువదిలి బయటికి ఎలా వచ్చానో. ఇంకేం చెప్పడానికి లేదు. దీన్ని యిక్కడితో ఆపేస్తే మంచిది. పడుకో" గబగబా గదిలోంచి బయటికొచ్చేసింది సమీర.

ప్రత్యూష మంచం దిగి తల్లివెనకాలే వచ్చింది.

"అంటే..నువ్వలా వెళ్ళిపోవడానికి కారణం మీ పెద్దవాళ్ళా!" సమీర కూతురు మాటలకి సమాధానం యివ్వడం కోసం, అక్కడ డైనింగ్ టేబుల్ దగ్గర ఓ కుర్చీలో కూచుంది. టైము చూసింది గోడ గడియారం 'పదిన్నర' చూపిస్తోంది.

రోజూ ఈ సమయానికి రేడియోలో వివిధభారతి వింటూ, పడుకోడానికి ప్రయత్నిస్తూంటుంది.

"ఏమో..ఆ సమయాన అలా అనిపించింది. సమయం గడుస్తూన్నకొద్దీ అభిప్రాయాల్లో, ఆలోచనల్లో మార్పులొచ్చి డైల్యూట్ అయిపోతాయి. అందుకని, అయిపోయిన దాని గురించి మనం మాట్లాడుకోకపోవడం మంచిది"

"లేదమ్మా..ఆపకు..కారణం పెద్దవాళ్ళంటావా!"

"చెప్పలేను. కానీ ఒక్కటి మాత్రం నిజం. బాల్యం దాటి కౌమార దశలోకి వస్తూన్నప్పుడు, ఇంట్లో వాతావరణం బావుండాలి. ఎందుకంటే అదే సరైన సమయం, పిల్లల్లో మానసిక మార్పులు జరగడానికి, అభిప్రాయాలు ఏర్పడ్డానికి.

అందుకని, ఆ సమయంలో తల్లిపాత్ర ఎంతో ఉంటుంది. ఇలాంటివాటిని అధిగమించడానికి, అయోమయ స్థితినుంచి కాపాడగలిగేది ఇంటి వాతావరణమే. దానికి తల్లిదే బాధ్యత.

పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో, వ్యక్తిత్వ వికాసంలో, జీవన గమనంలో, ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవంలాంటి వాటిని పెంచడంకోసం తల్లి ఎప్పుడూ ఓ ఉదాహరణలాగా ఉండాలి. అప్పుడే పిల్లలకి చెప్పగలిగే అధికారం ఉంటుంది.

ఇది ఒకవైపునే ఉందంటే తల్లీపిల్లల బంధం యజమానీ, సేవకులు లాగా ఉంటుంది.

ఎదుగుతున్న పిల్లల్లో శారీరక, మానసిక మార్పులు జరుగుతున్న సమయంలో తల్లి ఓ స్నేహితురాలిలాగా వెన్నంటే ఉండాలి.

తల్లి నుంచి ప్రేరణ కలగాలి. స్ఫూర్తి రావాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎలా ఎదుర్కోవాలో ఉదాహరణలుగా చిన్న చిన్న కథలు చెప్తూ నైతిక విలువలూ, బాధ్యతలూ పెంచుతూ గుర్తుచేస్తూండాలి.

అన్నింటికన్నా తల్లిదండ్రులు, పిల్లలకి అన్ని విషయాల్లో తోడుగా, అండగా ఉన్నారన్న భావం పిల్లల్లో కలగచేయడం ముఖ్యం. శతృవులమధ్య ఉండేలాంటి వాతావరణం ఉండకుండా చూసుకోవాలి.

ఇంట్లో వాతావరణం హాయిగా ఉంటే, పిల్లలు తప్పటడుగులు ఎందుకేస్తారు? ఆత్మహత్యలు చేసుకోవాలన్న ఆలోచనలెందుకు వస్తాయి? సామాజిక విలువలు, కుటుంబం, బ్రతుకులు వాటి ప్రామాణికం నేర్పించాల్సిన బాధ్యత ఇంట్లో పెద్దవాళ్ళదే.

అందుకే నేను, మా అమ్మ నుంచి ఏం కోరుకున్నానో అసలు, అమ్మ అంటే ఎలా ఉండాలో అలాగే ఉండడానికి ప్రయత్నించాను. మీరిద్దరూ మరో సమీర, మరో నాన్నలాగా అవకూడదని, రోల్ మోడల్స్‌గా ఉండేలాగా ప్రవర్తించాము. బాల్యం ఎప్పుడూ హాయిగా, నిర్మలంగా నిష్కల్మషంగా గడవాలి. ఎందుకంటే బాల్యం జీవితానికి పునాది. అది పటిష్టంగా ఉంటే చెడు ఆలోచనలు, వంకర బుద్ధులూ రావు.

నీకు ముందే చెప్పాను. నాది చేదు బాల్యం అని. ఆ యింటి వాతావరణంలోంచి ఎలా బయటపడాలి అన్న ఆలోచన ఒక్కటే ఉండేది. అంతేకానీ చేస్తున్నది తప్పు అని ఆ సమయాన నా కనిపించలేదు. ఇంక పడుకో. ఇప్పటికే చాలా పొద్దుపోయింది. నేను పొద్దున్నే లేవాలి"

మర్నాడు పొద్దున్న వంటింట్లో ఉన్న తల్లి దగ్గరికి వచ్చి సమీర బుగ్గమీద ముద్దుపెట్టింది ప్రత్యూష.

"థాంక్యూ..అమ్మా..రాత్రంతా ఆలోచించాను. చిన్నప్పటివి ఎన్నో గుర్తు తెచ్చుకున్నాను. ప్రతీ జ్ఞాపకం నా పెదవులమీద చిరునవ్వునే యిచ్చింది. నాకు అపురూపమైన, అందమైన బాల్యాన్నిచ్చావు. కాదమ్మా..నా బాల్యాన్ని కాపాడావు"

సమీర తేలికైన మనసుతో కూతురు నుదుట చిన్న ముద్దుపెట్టింది.

## ఆయనగారి కోసం...

**సైఫ్ అలీ ఖాన్ ఆగస్టు 16కి తన 40వ సంవత్సరంలోకి అడుగుపెట్టాడు. కాబోయే శ్రీవారి బర్త్‌డేని ఈసారి ఎంతో వెరయిటీగా జరపాలని నిర్ణయించుకున్న కరీనా కపూర్- 'రా..వన్' షూటింగ్ కోసం లండన్‌లో బిజీగా వున్నా కూడా సైఫ్ బర్త్‌డేకి స్విట్జర్లాండ్‌లోని లగ్జరియస్ స్కీయింగ్ రిసార్ట్స్‌లో అన్ని ఏర్పాట్లు చేసేసరికి సైఫ్ బోల్డు ఆశ్చర్యపోయాట్ట. సైఫ్‌కి స్కీయింగ్ అంటే ఎంతో ఇష్టం. అందుకనే అతని మనసెరిగినట్టు కరీనా అతని పుట్టినరోజు సెలబ్రేషన్స్‌కి ఏర్పాట్లు చేసేసరికి సైఫ్ ఎంతో ఇదైపోయాట్ట ఆమె 'లవ్వు'కి.**

